కలెక్టరేట్ ఎదుట కేక్ కట్‌చేసి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, అంగన్వాడీలు

అంగన్వాడీల వినూత్న నిరసన

అంగన్వాడీలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం 14వ రోజు అనంతపురం జిల్లాలో తమ ఆందోళనలు కొనసాగించారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో భాగంగా వినూత్న నిరసన చేపట్టారు. క్రిస్మస్ నేపథ్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ చర్చిల వద్ద, సమ్మె శిబిరాల వద్ద కేక్ కట్ చేశారు. అనంతపురం, పుట్లూరు, గుత్తి, రాయదుర్గం, పామిడి, ఉరవకొండ, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో ఆందోళన కొనసాగింది. సమ్మె శిబిరాల్లో కేక్ కట్‌చేశారు. సిఎం జగన్‌చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు.

అంగన్వాడీ సమ్మె 14వ రోజు

అంగన్వాడీల ఆందోళన పట్టదా..?

పిల్లలకు అన్నం లేదు.. ఆటా పాట లేదు...
పట్టించుకోని పాలకులు
ప్రభుత్వ వైఖరితో ప్రజల్లో అసహనం

తల్లుల కోసం రోడ్డుపై బైటాయించిన చిన్నారులు (ఫైల్ ఫొటో)

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నామని, ఉద్యోగులను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె బాటపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కేంద్రాల్లోని చిన్నారులు భోజనానికి, ఆటపాటలకు దూరమవుతున్నారు. గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తు గత 14 రోజులుగా చంటి బిడ్డలను తీసుకుని రోడ్డుపై వచ్చి అంగన్వాడీలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మాత్రం వీరిపై కాస్తా జాలి కూడా చూపడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ఆందోళన కార్యక్రమాలు హోరెత్తాయి. ప్రభుత్వ వైఖరితో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 2.25 మంది ఆరేళ్లలోపు చిన్నారులు, 16 వేల మంది గర్భిణులు, 18 వేల మంది వరకు బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలు తెరిపించి వాటిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సొంత భవనాలకు వేసిన తాళాలను కొన్నిచోట్ల పగలగొట్టించి, అద్దె భవనాలతో సహా మరికొన్ని చోట్ల నోటీసులు అంటించింది. ప్రభుత్వ వైఖరి ప్రజల్లో కూడా అసహనాన్ని తెప్పించింది. మూడు నెలల లోపు చిన్నారులకు రోజు ఒక గుడ్డు, పాలు అందించేవారు. ప్రస్తుతం పిల్లలకు పోషక ఆహారం అందడం లేదు. ఆటపాట లేదు.

సచివాలయ సిబ్బందితో నిర్వహణకు యత్నం

గర్భిణీలు, బాలింతలు, మూడు నుంచి 6 ఏళ్ల పిల్లలకు పంపిణీ చేయాల్సిన బాలామృతం కిట్లు సచివాలయాల సిబ్బందితో పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న అంగన్వాడీ కేంద్రాలను తెరిపిస్తున్నా అక్కడ కార్యకర్తలు, ఆయాలు కనిపించకపోవడంతో పిల్లలు రావడం లేదు. కేంద్రాలు తెరిచిన బువ్వ అందలేనప్పుడు ఏం ప్రయోజనం అని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సచివాలయాల్లో విధులతో పాటు అదనంగా ఈ బాధ్యతలను అప్పగించడంపై కొందరు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని తెరుస్తున్నామని పేరు చెప్పేందుకు అంగీకరించని మహిళా పోలీసులు, సచివాలయ సెక్రేటరీలు వాపోతున్నారు. ఈ కేంద్రాల్లో వంట వార్పు పర్యవేక్షణ అంటే కష్టం అంటున్నారు.

గడ్డితింలూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్‌ఫొటో)

కలెక్టరేట్ ఎదుట శిబిరంలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శిబిరం వద్ద ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. మోకాళ్లపై నిలబడి న్యాయం జరిగేలా చూడాలంటూ యేసుక్రీస్తును ప్రార్థించారు. వీరి నిరసనలకు ఉద్యోగ, ఉపాధాయ, కార్మిక సంఘాల నేతలు మద్దతుగా హాజరయ్యారు. జెఎసి ఛైర్మన్ కె.విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, అడవిరాజు, రమణప్రసాద్, వెంకటేష్, శ్రీనివాస్, పారిజాత, ఇక్బాల్ బాషా, సీతారామరావు, శివారెడ్డి, వెంకటేష్ హాజరై మద్దతు తెలిపారు.

సమగ్రశిక్షా సమ్మె 6వ రోజు

ప్రభుత్వ ఆసుపత్రి స్థలం టూరిజం శాఖకు ఇవ్వొద్దు

ఎమ్మెల్యే 'అనంత'కు ఎపిజిడిఎ నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజనాసుపత్రి ట్రస్టుకి సంబంధించిన సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ ఆసుపత్రి భూముల్లో ఎకరా భూమిని టూరిజం శాఖకు ఇవ్వడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైదుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామస్వామి నాయక్, ఉపాధ్యక్షులు డాక్టర్ వైఎంఎస్.ప్రసాద్, కోశాధికారి డాక్టర్ జి.హేమలత అన్నారు. ఈమేరకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యకళాశాల, ఆసుపత్రికి చెందిన భూమిని టూరిజం శాఖకు ఇస్తున్నట్లు వచ్చిన జిఓను రద్దు చేయాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అనంత సానకూలంగా మాట్లాడారు. ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని వేరొక శాఖకు అప్పగించడం జరగదని హామీ ఇచ్చారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని మైనార్టీ, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మస్తాన్ వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ ఆదేశాలతో జిల్లాలోని మైనారిటీ, బలహీన వర్గాల విద్యార్థులకు బేసిక్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెన్త్ పాసై 40ఏళ్లలోపు ఉన్న విద్యార్థులు అర్హులు అన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 2024, జనవరి 3వ తేదీ నుంచి కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మైనార్టీ, బలహీన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం సెల్..83280 28731, 83820 75558 నెంబర్లకు సంప్రదించాలని, ఉర్దూ అకాడమీ, కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ రఘువీరా టవర్స్‌లో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

సమస్యలు ఏ 'కరువు' పెట్టేరా..?

ఈ ఏడాది తీవ్రమైన కరువు నెలకొంది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరుగుతున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై నాయకులు చర్చిస్తారా లేక ఎప్పటిలాగానే తూతూమంత్రంగానే ముగిస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జెడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానికజిల్లా పరిషత్ సమావేశం హాలులో జరుగనుంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మన అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రెండు జిల్లాలకు సంబంధించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరవ్వాల్సి ఉంటుంది. అయితే గత కొన్ని సమావేశాలుగా చూస్తే ఎమ్మెల్యేలు, ఎంపీల హాజరు నామ మాత్రంగానే ఉంటోంది. వచ్చినా మొక్కుబడిగానే సమస్యలపై ప్రస్తావన ఉంటోంది. జిల్లా పరిషత్‌లో ఇద్దరు జెడ్పీటీసీలు మినహా తక్కిన వారందరూ అధికారపార్టీ వారే ఉన్నారు. దీంతో సమస్యలు మొక్కుబడిగానే ప్రస్తావనకు వస్తున్నాయి.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
సమస్యలు ప్రస్తావనకొచ్చేనా..లేక తూతూ మంత్రమేనా..?

జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువుపై స్పందించేరా ..?

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వం ఇప్పటికే రెండు జిల్లాల పరిధిలో 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కరువు బృందాలు కూడా పర్యటించి వెళ్లాయి. అయితే కరువు సహాయం ఏ మేరకు అందుతుందన్న దానిపై స్పష్టతలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సత్యసాయి జిల్లాలో పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటింకపోవడం గమనార్హం. అదే విధంగా అనతపురం జిల్లాలో మూడు మండలాలు మినహాయింపు ఉంది. అయితే ఈ మండలాల్లోనూ కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలపైనా విపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. నష్టాన్ని తక్కువ చేసి చూపే విధంగా ప్రభుత్వ తీరుందని విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లోని పరిస్థితులను స్థానిక ప్రజాప్రతినిధులు ఏ రకంగా ముందుకు తీసుకొస్తారన్నది చూడాల్సుంది.

ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన

వర్షాభావానికి తోడు తగినంత నీరు హెచ్ఎల్‌సి నుంచి రాకపోవడంతో ఆయకట్టు రైతుల్లో గుబులు నెలకొంది. జనవరి ఆఖరు వరకు రావాల్సిన నీరు నవంబరు ఆఖరుకే ముగిసింది. దీంతో ఆయకట్టు కింద ఉండే పంటలు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన బాటపట్టారు. ప్రత్యామ్నాయం ఉందని విపక్షాలు చెబుతున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్, ఎల్ఎల్‌సిల నుంచి నీటిని తీసుకునే అవకాశముందని సూచిస్తున్నాయి. ఈ అంశాలూ ఈ సమావేశంలో చర్చకొస్తాయా లేదా అన్నది చూడాల్సుంది.

ఎన్నికలు సమీస్తున్న వేళ సమస్యలు ముందుకొచ్చేనా ..?

ఈ సమావేశం నుంచి తరవాతి సమావేశంలోపు ఎన్నికలు మరింత సమీపించే అవకాశాలున్నాయి. అంతలోపు అభివృద్ధి కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశాలను అధికార ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తారా లేదా అన్నది చూడాల్సుంది. రోడ్డు పనులు, ఇతర అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. వీటిని వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో అంగన్‌వాడీ, ఆశ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం సాగిస్తున్నారు. దీనికి మద్దతునిస్తారా లేదా అన్నది కూడా చూడాల్సుంది.

'సూపర్ సిక్స్'ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోస్టర్లను అతికిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, నాయకులు

ఈనెల 30వ తేదీలోగా 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం పేరుతో చేపట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. సోమవారం అనంత అర్బన్‌లోని పలు డివిజన్లలో 'బాబు షూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ' సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రాష్ట్రంలో అనంతపురం నియోజకవర్గం 5వ స్థానంలో ఉందన్నారు. మొదటి స్థానానికి చేరుకునే విధంగా ముందుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. నగరంలోని 97 వేల ఇళ్లలో ఇప్పటికే సగభాగం బూత్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తయిందని, ఈనెల 30లోగా మిగిలిన శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే 50 డివిజన్లతో పాటు నాలుగు పంచాయతీల్లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ సంబంధించిన 600 పోస్టర్లను జన రద్దీ ప్రదేశాల్లో గోడలకు అతికించాలని ఆదేశించారు. ఒక్కో డివిజన్‌లో 30 నుంచి 40 వరకూ పోస్టర్లు ఉండాలన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలను సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికీ సూపర్ సిక్స్ గ్యారెంటీ బాండ్లను అందించి, అవగాహన కల్పించాలన్నారు. అలాగే గత ప్రభుత్వంలో నగరాభివృద్ధికి చేసిన అంశాలను సంబంధించిన కరపత్రికలను కూడా అందించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రాగానే నగరంలో భూగర్భ డ్రెయినేజీతో పాటు, రింగ్ రోడ్డు సౌకర్యం, గుత్తి రోడ్డులోని డంపు యార్డును తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవళ్ల మురళి, నటేష్‌చౌదరి, గోపాల్‌గౌడ్, సుధాకర్‌యాదవ్, ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, పరంధామ, చిర్రోల్ల రామాంజనేయులు, వడ్డే మురళి, రఫీక్‌ఆహమ్మద్, సైపుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తదిబ్బల మధ్య కుట్టు శిక్షణ కేంద్రం

సెల్ఫీ ఛాలెంజ్‌లో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కుట్టు శిక్షణ కేంద్రం వద్ద చెత్తకుప్పను చూపుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం నియోజకవర్గంలో ఎంతో ఉన్నతాశయంతో మహిళల ఉపాధి కోసం 'పుర' పథకం కింద ప్రారంభించిన కుట్టు శిక్షణ కేంద్రం (కామన్ ఫెసిలిటీ సెంటర్) చెత్తదిబ్బల మధ్య దీనంగా దర్శనమిస్తోందని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా సోమవారం పట్టణంలోని చెత్తకుప్పల మధ్య ఉన్న కుట్టు శిక్షణ కేంద్రం వద్ద సెల్ఫీ దిగి వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్మెంట్స్ పరిశ్రమకు రాయదుర్గం ప్రసిద్ధి చెందిందన్నారు. పూర్వం చేనేత పరిశ్రమను నమ్ముకుని ఇక్కడి ప్రజలు జీవనం సాగించేవారన్నారు. ఈసమయంలో చేనేత పరిశ్రమకు గడ్డు కాలం దాపురించి మగ్గాలన్నీ మూతబడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా దుస్తుల తయారీని ఇక్కడి వారు ఎంచుకున్నారన్నారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు రాయదుర్గంలో దుస్తుల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఈరంగంలో మహిళలకు వృత్తి నైపుణ్యం పెంచడంతోపాటు స్వయం ఉపాధి కల్పించాలని గతంలో 'పుర' పథకం కింద భవనాన్ని నిర్మించారని గుర్తు చేశారు. అంతేగాకుండా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టాటా సంస్థను ఒప్పించి వారి అధ్వర్యంలో కుట్టు శిక్షణ, దుస్తుల తయారీ కేంద్రాన్ని నిర్వహించామన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్ధాక్షిణంగా ఈ కేంద్రాన్ని మూసేసిందన్నారు. ప్రస్తుతం ఈ భవనాన్ని విప్ కాపు రామచంద్రారెడ్డి అనుచరుడు గోడౌన్‌గా ఉపయోగించుకుంటున్నాడన్నారు. వేలాది మందికి ఉపయోగపడాల్సిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని 'కాపు' తన స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు. గార్మెంట్స్ కార్మికులపై అతనికి ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. వెంటనే ఈ చెత్త ప్రభుత్వాన్ని దింపేయడానికి అందరూ ఐకమత్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యంగా అనంతపురంలోని ఎస్ఐయు టౌన్ కాంగ్రినేషనల్, అరవిందనగర్‌లోని సీయస్ఐ హోలి ట్రినిటి, జీవన్ కంపాషన్, రామచంద్రనగర్‌లోని కార్మిల్‌మాత, అంబేద్కర్ నగర్‌లోని కేసుక్రీస్తు ప్రార్థనామందిరం, కళ్యాణదుర్గం రోడ్డులోని క్రీస్తు సంఘం, కోర్టు రోడ్‌లోని గాస్పెల్ హాల్, నాయక్‌నగర్ అగాపే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏసయ్యా.. సిఎంకు మంచి బుద్ధి ప్రసాదించు..!

సమ్మె దీక్షల్లో కేక్‌లు కోసి అంగన్వాడీల వినూత్న నిరసన

అనంతపురంలో కేక్ కోసం పంచిపెడుతున్న సిఐటియు, అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి సిఎం జగన్ స్పందించేలా ఏసుక్రీస్తు మంచి బుద్ధి ప్రసాదించాలని సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవదిక సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. ఆయా మండలాల్లో క్రిస్మస్ పండుగ సందర్భంగా దీక్షా శిబిరాల వద్ద కేక్ కట్ చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. సామూహిక ప్రార్ధనలు చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా నాయకులు రామాంజినేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు జయభారతి, కార్యదర్శి జమున హాజరై అంగన్‌వాడీ పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులుగా అంగన్‌వాడీలు రోడ్లపై వచ్చి ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేకుండా ఉందన్నారు. ఇచ్చిన హామీలు చేయకుండా ముఖ్యమంత్రి మాట తప్పడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో అంగన్‌వాడీల తీర్పుకు వైసిపి ప్రభుత్వం బలికాక తప్పదన్నారు. పండుగ రోజు కూడా అర్ధాకలితో ఉండాల్సిన పరిస్థితిని కల్పించారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆజాం భాష, అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ నాయకులు అరుణ, రుక్మిణి, సుహాసిని, అరిఫా, సంధ్య, రేవతి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఏసు ప్రభు... ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించి తమ సమస్యలు పరిష్కరించేందుకు మార్గం చూపాలని అంగన్వాడీలు కోరారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా దీక్ష శిబిరంలో క్రిస్మస్ కేక్ కోసి నిరసన వ్యక్తం చేశారు. వీరి సమ్మెకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ అంగన్వాడీలు 14రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. స్వయాన జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయమంటే పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే యుటిఎఫ్ నాయకులు రవికుమార్, శ్రీనివాసులు, తదితరులు సోమవారం దీక్షా శిబిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, శోభ, లతా, హేమలత, చంద్రకళ, అంగన్వాడీలు, సహాయకులు పాల్గొన్నారు.

గుత్తిలో ఏసుక్రీస్తు చిత్రపటానికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు

తాడిపత్రి : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 14వ రోజు కొనసాగింది. ఇందులో భాగంగా సమ్మె దీక్ష శిబిరంలో అంగన్వాడీ సెంటర్ల పిల్లలతో కేక్ కోసి క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా అంగన్వాడీల సమస్యపై సీఎం జగన్ స్పందిస్తారని ఆశించామని, అయినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేంత వరకూ ఇచ్చిన హామీను నెరవేర్చేంత వరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదని తెలిపారు.

గుత్తి : సమస్యల పరిష్కరించేలా సీఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఏసుక్రీస్తు చిత్రపటానికి అంగన్వాడీలు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గుత్తిలో సోమవారం 14వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో ఏసుక్రీస్తు చిత్రపటాన్ని ఉంచి గంగ అనే అంగన్వాడీ కార్యకర్త ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్‌లు కోసి పంచిపెట్టారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మద్దతు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ నాయకురాళ్లు కళ్యాణి, పార్వతి, బావమ్మ,గంగ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉరవకొండలో అంగన్వాడీల సమ్మె సోమవారం 14వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా దీక్ష శిబిరంలోనే క్రిస్మస్ కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. వీరి సమ్మెకు సిపిఎంతోపాటు సత్య సాయి వాటర్ సప్లై కార్మికులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి వాటర్ సప్లై యూనియన్ నాయకులు బాలకృష్ణ, సిపిఎం నాయకులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, జి.శ్రీనివాసులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పామిడి : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీలు స్థానిక ఆర్టీటీ బస్టాండ్ సమీపంలో చేపట్టిన సమ్మె సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాళ్లు జయంతి, నారాయణమ్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టిఎ బిల్లులను తక్షణం చెల్లించాలన్నారు. ఆయాల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. కాగా వీరి సమ్మెకు రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతతెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, సేకున్‌బి, ప్రేమకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పామిడిలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ఎస్ఎస్ఎ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సామూహిక ప్రార్థనలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేలా సిఎం జగన్‌కు యేసుక్రీస్తు మంచి బుద్ధి ప్రసాదించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ప్రార్థించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శిబిరం వద్ద ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి న్యాయం జరిగేలా చూడాలంటూ యేసుక్రీస్తును ప్రార్థించారు. వీరి నిరసనలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు మద్ధతుగా హాజరయ్యారు. జెఎసి ఛైర్మన్ కె.విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, అడవిరాజు, రమణప్రసాద్, వెంకటేష్, శ్రీనివాస్, పారిజాత, ఇక్బాల్ బాషా, సీతారామరావు, శివారెడ్డి, వెంకటేష్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి సిఎం జగన్ మాట నిలపుకోవాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల జెఎసి నాయకులు అంజన్‌రాజు, రమణ, లీలావతి, సునీత, రాంమ్మోహన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మృతదేహంతో బంధువుల ఆందోళన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం సాయంత్రం ఓ భూతగాదా విషయంలో అదే గ్రామానికి చెందిన రామాంజినేయులు మరోవర్గం వారి చేసిన దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా సోమవారం మృతుడి బంధువులు పోస్టుమార్టం అనంతరం శవాన్ని తీసుకుని గాజుల ప్రభాకర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు ఉన్నం మారుతి అక్కడికి చేరుకుని రామాంజినేయుల కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలిచారు. పరిస్థితి అదుపు తప్పడంతో సీఐ నాగరాజు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

ట్యాంకు ఏర్పాటుకు భూమిపూజ

ఉరవకొండ : ఉరవకొండలోని 8వవార్డు సిపివి నగర్ కాలనీలో రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న నూతన బోర్‌వెల్ సిస్టం ట్యాంకు నిర్మాణానికి ఎంపీపీ నరసింహులు ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో తాగునీటి ఎద్దడి తీర్చడానికి, ప్రజల అవసరాల కోసం అనేక సిస్టం ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కురుబ లక్ష్మీదేవి, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, మాజీ ఎంపిపి చంద్రమ్మ, వైసిపి నాయకులు బసవరాజు, ఓబన్న, పచ్చి రవి, ప్రకాష్, పార్టీ నాయకులు అంజి, బీమా తదితరులు పాల్గొన్నారు.

సిసి రహదారుల పనులు ప్రారంభం

భూమిపూజ చేస్తున్న నాయకులు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం నూతన సిసి రహదారుల పనులు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎంపీపీ జి.విశాలాక్షి, వైస్ ఎంపీపీ సుద్దాల తిరుపాలమ్మ చొరవతో గ్రామంలో సిసి రహదారుల నిర్మాణం కోసం రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులతో కొత్తపేటలోని కొత్తూరు బీసీ కాలనీలో చేపట్టిన పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బీసీ సెల్ మండల అధ్యక్షులు సుద్దాల రాముయాదవ్, నాయకులు ఎస్.వెంకటరాముడుయాదవ్, ఎస్.సుధాకర్‌యాదవ్, నాగరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The VIII Addl.District Judge,Ananthapuramu
I.A. No.62/2023 in O.S. No.21/2023
Between :
Juturu Mallikarjuna Reddy and anothers
...Petitioners/Plaintiffs
V/S
Y.Narahari Murthy & 7orther
...Respondents/Defendants
Notice to Respondent No.6
To:
Penchala Reddy S/o Chenchu Reddy, R/o D.No:12-226, Thilak Road, guntakal, Ananthapuramu District.

పై కనబరచిన I.A. No.62/2023 in O.S. No.21/2023 లో 6వ ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు వారు 04/01/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఖుద్దున గాని వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మాణము చేయబడును.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
అల్లు నారాయణప్ప, అడ్వకేట్,
అనంతపురం, సెల్:9908616177

In The Court of The VIII Addl.District Judge,Ananthapuramu
O.S. No.21/2023
Between :
Juturu Mallikarjuna Reddy and another
...Plaintiffs
V/S
Y.Narahari Murthy & 7orther
...Defendants
Notice to Defendent No.6
To:
Penchala Reddy S/o Chenchu Reddy, R/o D.No:12-226, Thilak Road, guntakal, Ananthapuramu District.

పై దావాలో లో 6వ ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు వారు 04/01/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఖుద్దున గాని వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మాణము చేయబడును.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
అల్లు నారాయణప్ప, అడ్వకేట్,
అనంతపురం, సెల్:9908616177

గిరిజనుల హక్కుల పరిరక్షణకు కృషి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని గిరిజనుల హక్కుల పరిరక్షణకు సిఎం జగన్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు జి.మల్లికార్జున నాయక్ ఆధ్వర్యంలో వచ్చేనెల 7న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న గిరిజన శంఖారావం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గిరిజనులు హక్కుల పరిరక్షణ ధ్యేయంగా కలిసికట్టుగా ముందుకెళ్తే మరింత అభివృద్ధి చెందుతారని వివరించారు. రాష్ట్రంలోని ఉన్న గిరిజనులు సంకటితమై సభ విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిపిఎస్ జివిఎస్ నాయకులు, వైసిపి నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి

బలిజ సంఘం అధ్యక్షులుగా బండి సత్య

ప్రజాశక్తి-గుత్తి

మండల బలిజ సంఘం అధ్యక్షులుగా బండి సత్య ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలో బలిజ సామాజికవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజికవర్గ పెద్దల సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బండి సత్య, గౌరవాధ్యక్షులుగా గంటా నరహరి, ధర్మాపురం శ్రీనివాసులు, ఎ.పులికొండ, ఉపాధ్యక్షులుగా ఉపాధ్యాయుడు వలసాని శ్రీనివాసులు, రాగినేని వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి సురేష్, సహాయ కార్యదర్శులు కొత్తపేట నాగేశ్వరరావు, పురుషోత్తం, సుంకన్న, కోశాధికారి శివ రంగనాయకును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు బండి సత్య మాట్లాడుతూ బలిజల హక్కుల సాధన కోసం పోరాడుతామన్నారు. బలిజ కులస్తుల అభివద్ధి కోసం కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బలిజ సంఘం నిధి కోసం బండి సత్య రూ.లక్ష, పసుపులేటి సురేష్ రూ.25వేలు, ఎ.పులికొండ రూ.20వేలు, గోరంట్ల నాగయ్య, కప్పట్రాళ్ల సురేష్ రూ.15వేలు చొప్పున, నాగేశ్వరరావు, వెంకటరమణ 10,116 చొప్పున విరాళమిచ్చారు. విరాళాలు ఇవ్వడం పట్ల సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

టిడిపితోనే బడుగుల అభివృద్ధి

ప్రజాశక్తి-పామిడి

తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ డాక్టర్స్ సెల్స్ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కత్రిమల గ్రామంలో 'బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్నివర్గాల అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వైసీపీ అరాచక పాలనను ఇంటికి పంపించాలంటే ప్రతి ఒక్కకరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు, హరిప్రసాద్, కేశప్ప, ఓబులయ్య, వంశీ, ముసలిరెడ్డి, దేవరపల్లి మాజీ సర్పంచి ప్రతాప్, తిరుపాలు, రామాంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, ప్రతాప్, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమా నాయక్, రాధా, జానకి, అరుణ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న టిడిపి డాక్టర్స్ సెల్స్ అనంతపురం పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అనంతపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న యేసు కపా మందిరం వ్యవస్థాపకులు రెవ. రెడ్డివారి నేహెమ్యా నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

క్రిస్మస్ పండుగను క్రైస్తవులు జిల్లా వాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నగరంలోని ఎస్ఐయు టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి, అరవిందనగర్‌లోని సీయస్ఐ హోలి ట్రినిటి చర్చి, జీవన్ కంపాషన్ చర్చి, రామచంద్రనగర్‌లోని కార్మిల్‌మాత చర్చి, అంబేద్కర్ నగర్‌లోని కేసుక్రీస్తు ప్రార్ధనామందిరం, కళ్యాణదుర్గం రోడ్డులోని క్రీస్తు సంఘం చర్చి, కోర్టు రోడ్‌లోని గాస్పెల్ హాల్ చర్చి, నాయక్ నగర్ అగాపే చర్చి, సిండికేట్ నగర్ సమీపంలోని యేసు కృపా మందిరం, తదితర చర్చీల్లో నిర్వహించిన ప్రార్థనలకు క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు హాజరై క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చర్చీ పాస్టర్‌లు నిర్వహించిన ప్రార్ధనల్లో వారు పాల్గొన్నారు. యేసు కపా మందిరంలో క్రిస్మస్ ఆరాధన ఘనంగా జరిగాయి. యేసు కపా మందిరం వ్యవస్థాపకులు రెవ. రెడ్డివారి నేహెమ్యా నాగరాజు ముఖ్య సందేశాన్ని అందించారు. అనంతరం వృద్దులు, పేదలకు చీరలు, దుప్పట్లు, పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సేవకులు నవీన్ కుమార్, రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, సిస్టర్ లీన నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక రాచనపల్లి సమీపంలో ఉన్న సెయింట్ జోసెఫ్ సంసిద్ పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఏసుప్రభు, మేరీ మాత, క్రిస్మస్ తాత వంటి వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవాణి, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నియోజకవర్గంలోని విడపనకల్, వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు. ఉరవకొండలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని కృపాకర్ ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ డేవిడ్ మాట్లాడుతూ యేసు మార్గం సన్మార్గమన్నారు. ఆయన మార్గంలో పయనించడం, ఆయన సూక్తులు పాటించడం గొప్ప వరమన్నారు. ఈ వేడుకల్లో మాజీ మార్కెట్ ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, శింగనమల వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు అమీర్‌బాషా, వైసిపి నాయకులు చికెన్ గోపాల్, శివయ్య, ఖాదరవల్లిఖాన్, పెద్దన్న, బాలనాగి, బయన్న, నాగరాజు, మోహన్, మహారాజు, మేఘన, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రిస్టియన్ సోదరులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయాన్నే స్నానమాచరించి, నూతన దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పెద్దవడుగూరు పెద్దవాగు వద్ద ఉన్న చర్చి పాస్టర్ జాన్ డేవిడ్, పెద్దవడుగూరు చేనేత కాలనీలో స్వతంత్రకుమార్ ప్రభువు జననం గురించి వివరించారు.

పుట్లూరు : మండల కేంద్రంతోపాటు ఎస్.గూడూరు, కడవకల్లు, తదితర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా చర్చిలను దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

పామిడి : పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా చర్చి ఫాదర్ విశ్వమోహన్ సోమవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం క్రీస్తు జననం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విజయ్, రత్నరాజు, వీరయ్య, ఆనంద్, అబ్రహం, అనిల్, రాజు, బాబావలి, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో కేక్ కట్‌చేస్తున్న వైసిపి యువనేత ప్రణయ్‌రెడ్డి

రాయదుర్గంలో కేక్ కోస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు దంపతులు

రాయదుర్గం : రాయదుర్గంలోని వివిధ చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి కింగ్ ఆఫ్ శాలెం చర్చి, గిల్గాలు చర్చి, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు మెస్సయ్య మిరకిల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీస్తు జననం ప్రపంచానికి మార్గదర్శకం అన్నారు. అలాగే మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప పాస్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ జయచంద్ర క్రైస్తవులకు బైబిల్ సందేశం వినిపించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాలవ విజయలక్ష్మి, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

పామిడి : పట్టణ పరిధిలోని షాదీఖానాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ డాక్టర్ నల్లపాటి తరుపతినాయుడు, డాక్టర్ శాంతిప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. క్లబ్ కమిటీ సభ్యుల సహకారంతో నిర్వహించనున్న వైద్యశిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చేవారు తమ ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్లో ఏదైనా ఒక కార్డు జిరాక్స్‌తోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు.

ఆలయంలో అన్నదానం

పుట్లూరు : మండలంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో దాతల సహకారంతో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు సుబ్బయ్య, చెంగల రవికుమార్, ఎం.గంగాధర్, రమేష్ శెట్టి, కె.రామచంద్రారెడ్డి, అర్.ఓబులేసు, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

28న రైతుకూలీ సంఘం జిల్లా మహాసభలు

రాయదుర్గం : ఈనెల 28న జిల్లాలోని కణేకల్లులో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు రైతు కూలీసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈమేరకు సోమవారం పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు బారిన పడిన రైతులను ఆదుకోవడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించనున్న జిల్లా మహాసభలకు రైతులు, కూలీలు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలనా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు దస్తగిరి, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సిఎల్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన లావణ్యకు అభినందనలు

నార్పల : సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ఎంపికైన మండల పరిధిలోని నాయనపల్లి గ్రామానికి చెందిన బీసీ శ్రీరాములు కూతురు లావణ్యను నార్పల ఎస్సీ బాలుర వసతి గృహం పూర్వపు విద్యార్థులు సోమవారం అభినందించారు. ఈమేరకు లావణ్యతోపాటు పాటు తల్లిదండ్రులకు పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లావణ్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలి ఆకాంక్షించారు. పేదరికంలో పుట్టి సబ్‌ఇన్స్‌క్టర్‌గా ఎదగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ బాలుర వసతి గృహం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన లావణ్య, తల్లిదండ్రులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

అనంతపురం : రాప్తాడు మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గొల్ల నారాయణస్వామి గొల్ల రాజమ్మ కుమారుడు గొల్ల రవితేజ (25) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. రవితేజ డిగ్రీ వరకూ చదువుకున్నాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ తలీదండ్రికి వ్యవసాయంలో సహాయం చేస్తూ ఉండేవాడు. ఈనేపథ్యంలో ఆవుల దాణా కోసం జి.కొత్తపల్లి గ్రామం నుంచి స్కూటీ వాహనంపై అనంతపురానికి వెళ్తుండగా కక్కలపల్లి గ్రామం దగ్గరకు రాగానే వెనుక వైపు నుంచి వచ్చిన బొలేరో వాహనం స్కూటీని ఢీకొంది. దీంతో రవితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న అనంతపురం రూరల్ టూటౌన్ ఎస్ఐ ప్రవీణ్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నఫలంగా కొడుకు మరణించడంతో తల్లిదండ్రి బాధ వర్ణణాతీతంగా మారింది.